ఆదివారం 26-5-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 346, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## తాను పూర్తిగా భగవంతుడికి అంకితం

- ఒక లక్ష్యం కోసం దేవుడు నన్ను ఎంచుకున్నాడు
- భగవంతుడు తనకు మార్గనిర్దేశం చేస్తాడు
- ప్రధాని మోడీ ఒక ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు



**ముందడుగు జాతీయం:**


తనను తాను పూర్తిగా భగవంతుడికి అంకితం చేసుకున్నానని, దేవుడు తనను ఒక లక్ష్యం కోసం ఎంచుకున్నాడని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. తనను లక్ష్యం కోసం పంపాడని నమ్ముతానని.. ఆ లక్ష్యం నెరవేరే వరకు తన కర్తవ్యాన్ని కొనసాగిస్తానని అన్నారు. చాలా పనులు చేసేందుకు భగవంతుడు తనకు మార్గనిర్దేశం చేస్తాడని ప్రధాని మోదీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

నా మీద దూషణలు చేసే వ్యక్తులు ఉన్నారు.. నన్ను అభిమానించి, మంచి విషయాలను వ్యక్తపరిచే వారిని కూడా చూస్తుంటారు. విశ్వాసం వ్యక్తం చేసే వారిని బాధపెట్టకుండా.. నిరాశ చెందకుండా చూడటమే నా కర్తవ్యం. కొందరు నన్ను పిచ్చి అని పిలవవచ్చు, కానీ 'పరమాత్మ' (దేవుడు) నన్ను ఒక లక్ష్యం కోసం పంపాడని నేను నమ్ముతున్నాను. లక్ష్యం నెరవేరిన తర్వాత.. నా పని పూర్తి అవుతుంది. అందుకే నేను పూర్తిగా భగవంతునికి అంకితం చేసుకున్నాను'' అని మోడీ అన్నారు. మిగతా 2లో




## కాలువలోకి తీసుకెళ్లిన టూరిస్టుల వాహనం

వివరాలు 2లో



## గొడుగు పట్టుకొని బస్సు నడిపిన డ్రైవర్

వివరాలు 3లో



## ఐటీ, సాఫ్ట్ వేర్ రంగం కుదేలేనా..!

వివరాలు 4లో

## మీ దేశం సంగతి మీరు చూసుకోండి

- మీ మద్దతు మాకు ఏం అక్కర్లేదు
- పాకిస్థాన్ ఎంపీకి కేజ్రీవాల్ సమాధానం

**ముందడుగు ఢిల్లీ:**

మా వ్యవహారాల్లో తల దూర్చకుండా.. మీ దేశం సంగతి మీరు చూసుకోండి' మీ మద్దతు ఏం అక్కర్లేదంటూ పాకిస్థాన్ ఎంపీకి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల ఆరోవిడతలో భాగంగా అరవింద్ కేజ్రీవాల్, తన కుటుంబసభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం సంబంధిత మిగతా 2లో



## మోడీ 56 అంగుళాల ఛాతీ ఎక్కడ

- భారత్ భూభాగాలను చైనా ఆక్రమించింది
- మోడీ ఎందుకు మౌనంగా ఉంటున్నారు
- ప్రధానిపై మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు

**ముందడుగు హిమాచల్ ప్రదేశ్:**

చైనా మన దేశం ప్రాంతాలను ఆక్రమించినా.. ప్రధాని ఇంకా ఎందుకు మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల ప్రచారంలో మిగతా 2లో



## చార్‌ధామ్ యాత్రలో 16 రోజుల్లో 56 మంది మృతి

వివరాలు 2లో

ముందడుగు
ఆదివారం, 26-5-2024, హైదరాబాద్

## తాను పూర్తిగా భగవంతుడికి అంకితం

మొదటిపేజీ తరువాయి

దేవుడు తనకు చాలా పని చేసేలా మార్గనిర్దేశం చేస్తాడని ప్రధాని మోదీ అన్నారు. ఆ తర్వాత ఏం జరుగుతుందనేది మాత్రం తెలియదని చెప్పారు. ''ఆయన (దేవుడు) తన వ్యూహాలను బహిర్గతం చేయడు, నన్ను పనులు చేయిస్తున్నాడు. తర్వాత ఏమి జరుగుతుందో అడగడానికి నేను అతనికి నేరుగా డయల్ చేయలేను'' అని మోదీ పేర్కొన్నారు. ఎన్నికల వేళ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న మోదీ.. తాను ప్రతిపక్ష నేతలను శత్రువులుగా భావించడం లేదని కూడా స్పష్టం చేశారు. భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిపక్ష నేతలతో కలిసి పనిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

## మీ దేశం సంగతి మీరు చూసుకోండి

మొదటిపేజీ తరువాయి

చిత్రాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ పోస్ట్‌ను పాకిస్థాన్ మాజీ మంత్రి, ఎంపీ చౌధరి ఫహద్ హుస్సేన్ రీపోస్ట్ చేస్తూ.. ద్వేషం, అతివాద భావజాలంపై శాంతి, సామరస్యం విజయం సాధించాలని కామెంట్ పెట్టారు. దానికి ఇండియా ఎలక్షన్స్ అనే హ్యాష్ ట్యాగ్ జత చేశారు. దీనిపై అరవింద్ కేజ్రీవాల్ వెంటనే స్పందించారు. ''చౌధరి సాహెబ్.. మా దేశ సమస్యలను నేను, నా దేశ ప్రజలు పరిష్కరించుకోగలం. ఈ విషయంలో మీ సలహాలేం మాకు అక్కర్లేదు. అసలే మీ దేశం పరిస్థితి అంతంతమాత్రంగా ఉంది. ముందు దాని సంగతి చూడండి. భారత్‌లో ఎన్నికలు అనేవి మా అంతర్గత వ్యవహారం. ప్రపంచం పైకి ఉగ్రవాదాన్ని ఎగదోసే మీలాంటి వారి జోక్యాన్ని మా దేశం ఏమాత్రం సహించదు'' అంటూ అరవింద్ కేజ్రీవాల్ పోస్ట్ చేశారు.

# ఎంతమంది ఓటేశారో తెలుసుకోవచ్చు

### పోలైన ఓట్ల సంఖ్యను మార్చడం అసాధ్యం ■ ఈసీ వెబ్‌సైట్‌లో పోలైన ఓట్ల గణాంకాలు

**ముందడుగు జాతీయం:**

నియోజకవర్గాల వారీగా మొత్తం ఓట్లు, పోలైన ఓట్ల గణాంకాలను కేంద్ర ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది. దేశంలో ఎన్నికల ప్రక్రియకు హాని కలిగించేలా ఒక క్రమపద్ధతిలో తప్పుడు కథనాల వ్యాప్తి, దుర్మార్గపు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈసందర్భంగా ఆరోపించింది. పోలైన ఓట్ల సంఖ్యలో మార్పులు చేయడం అసాధ్యమని మరోసారి స్పష్టంచేసింది.




ఓటింగ్ పూర్తయిన 48 గంటల్లోగా ప్రతీ పోలింగ్ కేంద్రం వారీగా ఓటింగ్ శాతాలను ఈసీ వెబ్‌సైట్‌లో ఉంచాలని అభ్యర్థిస్తూ 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)' సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పటికే అయిదు దశల పోలింగ్ ముగిసి.. మరో రెండు దశలు మాత్రమే మిగిలిఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో దీనిపై ఈసీకి ఆదేశాలు జారీ చేయలేమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసిన వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రతీ పార్లమెంటు నియోజకవర్గంలో ఓటు హక్కును వినియోగించుకున్న వారి కచ్చితమైన సంఖ్యను వెల్లడించేందుకు 'ఓటర్ టర్నవుట్' డేటా ఫార్మాట్‌ను మరింత విస్తరించాలని నిర్ణయించినట్లు ఈసీ తెలిపింది. మొత్తం ఓటర్ల సంఖ్య, నమోదైన పోలింగ్ శాతం ద్వారా ఎంతమంది ఓటేశారనేది తెలుసుకోవచ్చని పేర్కొంది.


ఈ రెండు వివరాలు ఇప్పటికే ప్రజల వద్ద అందుబాటులో ఉన్నాయని గుర్తు చేసింది. పోలింగ్ శాతాన్ని విడుదల చేస్తున్న ఈసీ.. నమోదైన ఓట్ల సంఖ్యనూ వెల్లడించాలని డిమాండ్లు వస్తోన్న నేపథ్యంలో ఈమేరకు స్పందించింది.

## ఐదు నిమిషాల ముందు ట్రైన్ టికెట్ బుక్ చేసుకోవచ్చు

### కేంద్ర రైల్వేశాఖ కల్పించిన సదుపాయం

**ముందడుగు రైల్వేశాఖ**

అనుకోకుండా మనకు ఎక్కడికైనా ప్రయాణం ఖరారైతే రైలు బయల్దేరడానికి ఐదు నిమిషాల ముందు కూడా టికెట్ బుక్ చేసుకోవచ్చు. అనేక కారణాలతో ప్రయాణం రోజునే టికెట్ క్యాన్సిల్ చేసుకొనే వారు ఉంటారు. అలాంటి సందర్భంలో ఖాళీగా ఉన్న టికెట్లను విక్రయించేందుకు రైల్వే శాఖ ఈ సదుపాయాన్ని తీసుకొచ్చింది. ప్రతి ట్రైన్ టికెట్ బుకింగ్ కన్ఫర్మేషన్ కోసం రైల్వే శాఖ రెండు ఛార్ట్‌లను ప్రిపేర్ చేస్తుంది. ఫస్ట్ ఛార్ట్ అనేది రైలు బయల్దేరడానికి 4 గంటల ముందు ప్రిపేర్ అవుతుంది. రెండో ఛార్ట్ రైలు స్టార్ట్ అవ్వడానికి ముందు రూపొందిస్తారు. గతంలో అరగంట ముందు వరకు మాత్రమే టికెట్ బుకింగ్‌కు అనుమతించేవారు. ఇప్పుడు రైలు బయల్దేరడానికి 5 నిమిషాల ముందు వరకు ఆ వెసులుబాటు కల్పించారు. కాబట్టి ట్రైన్ స్టార్ట్ అయ్యే ఐదు నిమిషాల ముందు కూడా టికెట్లు అందుబాటులో ఉంటే ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. అప్పటికీ దొరక్కపోతే ప్రత్యామ్నాయాలను చూసుకోవచ్చు.



### ఎలా తెలుసుకోవాలంటే?

చివరి నిమిషం వరకు ట్రైన్ టికెట్లు బుక్ చేసుకోసుకోవడం కోసం ముందుగా అందులో సీట్లు ఖాళీ ఉన్నాయా లేదా తెలుసుకోవాలి. రైల్వే శాఖ ప్రిపేర్ చేసే ఆన్‌లైన్ ఛార్ట్ ద్వారా ఈ విషయం తెలుసుకోవచ్చు. దీనికోసం ముందుగా IRCTC యాప్ ఓపెన్ చేసి ట్రైన్ సింబల్‌పై క్లిక్ చేస్తే.. ఛార్ట్ వేకెన్సీ సదుపాయం కనిపిస్తుంది. లేదా నేరుగా ONLINE CHARTS వెబ్‌సైట్‌లోకి వెళ్లి చెక్ చేయొచ్చు. అక్కడ ట్రైన్ పేరు/నంబర్, తేదీ, ఎక్కాల్సిన స్టేషన్ వివరాలు ఎంటర్ చేసి GET TRAIN CHARTపై క్లిక్ చేయాలి. వెంటనే తరగతుల వారీగా (ఫస్ట్ ఏసీ, సెకెండ్ ఏసీ, థర్డ్ ఏసీ, చైర్ కార్, స్లీపర్) అందుబాటులో ఉన్న ఖాళీ సీట్ల వివరాలు కనిపిస్తాయి. సీటు ఉంటే టికెట్ బుక్ చేసుకోవచ్చు. ఒకవేళ సీట్లు లేకపోతే సున్నా చూపిస్తుంది. కోచ్ నంబర్, బెర్త్... మొత్తం వివరాలు అక్కడే కనిపిస్తాయి. ట్రైన్ ప్రారంభం అయ్యే స్టేషన్లలో ఎక్కేవారికే ఈ ఆప్షన్ ప్రయోజనకరంగా ఉంటుంది.

## చార్‌ధామ్ యాత్రలో 16 రోజుల్లో 56 మంది మృతి

### గుండెపోటు కారణంగా అధిక మరణాలు



**ముందడుగు ఉత్తరాఖండ్:**

దేశంలోనే పేరుగాంచిన యాత్ర చార్ధామ్.. ప్రతి ఒక్క హిందువు తన జీవిత కాలంలో ఒక్కసారైనా చార్ధామ్ యాత్ర చేయాలని అనుకుంటారు. అందుకు తగ్గట్టుగానే ప్రతి సంవత్సరం చార్ధామ్ వెళ్లే యాత్రికుల సంఖ్య పెరిగిపోతుంది. అలాంటిది చార్‌ధామ్ యాత్రలో విషాదం చోటు చేసుకుంది. యాత్ర ప్రారంభమైన 16 రోజులు 56 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో 50 ఏళ్లు పైబడిన 40 మంది ఉన్నారు. 47 మంది గుండెపోటు, పల్మనరీ ఎడెమా కారణంగా మరణించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నారు. అత్యధికంగా కేదార్‌నాథ్ ధామ్ యాత్ర మార్గంలో ఇప్పటి వరకు గరిష్ఠంగా 27 మంది ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం సాయంత్రం నలుగురు గుండెపోటుతో మరణించారు. బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి సముద్రమట్టానికి ఎత్తున హిమాలయప్రాంతాల్లో ఉన్నాయి.

చలితో పాటు ఆక్సిజన్ అందక శ్వాస తీసుకోవడంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. మే 10న మొదలైన చార్‌ధామ్ యాత్రలో 15 రోజుల్లో 52 మంది యాత్రికులు గుండెపోటు, పల్మనరీ ఎడెమా, అల్పోష్ణస్థితి (శరీర ఉష్ణోగ్రత తగ్గిన సమయంలో గుండెపోటు ఆగిపోవడం), తలకు బలమైన గాయాల కారణంగా మరణించారు. ఇప్పటి వరకు 56 మంది భక్తులు యాత్ర కోసం వచ్చి ప్రాణాలు కోల్పోయారని గర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే ధ్రువీకరించారు. మృతుల్లో అత్యధికంగా 60 సంవత్సరాలు పైబడిన వ్యక్తులే ఉన్నారని.. ఇందులో ఎక్కువగా గుండెపోటు బాధితులే ఎక్కువగా ఉన్నారన్నారు. ఆరోగ్యం బాగాలేని వ్యక్తులు యాత్రకు వెళ్లకపోవడమే మంచిదని పరీక్షలు నిర్వహించిన అనంతరం వైద్యులు సూచిస్తున్నారు.



### గూగుల్ మ్యాప్స్ చూస్తూ డ్రైవింగ్

## కాలువలోకి తీసుకెళ్లిన టూరిస్టుల వాహనం

**ముందడుగు కేరళ:**

ఎవరైనా కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు లేదా తమకు తెలియని ప్రాంతాలకు వెళితే చాలా మంది గూగుల్ మ్యాప్స్ నమ్ముకుంటారు. గూగుల్ మ్యాప్స్ చూస్తూ వెళతారు. అలాంటిది గూగుల్ మ్యాప్స్ చూస్తూ డ్రైవింగ్ చేస్తున్న ఓ హైదరాబాదీ టూరిస్టుల బృందం తృటిలో భారీ ప్రమాదం నుంచి బయటపడ్డారు. కేరళలో విహారానికి వెళ్లిన ఆ బృందం.. గూగుల్ మ్యాప్స్ చూస్తూ వాహనాన్ని నడిపారు. అయితే దక్షిణ కేరళలోని కురుప్పనతార వద్ద ఓ కాలువలోకి వాళ్లు ప్రయాణిస్తున్న వాహనం దూసుకెళ్లింది. ఆ వాహనంలో నలుగురు ప్రయాణికులు ఉన్నారు. దాంట్లో ఓ మహిళ కూడా ఉన్నది. అలప్పుజా వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది.

ప్రస్తుతం కేరళలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో.. నదులు ఉప్పొంగుతున్నాయి. దీంతో కాలువల్లోనూ నీటి ప్రవాహం అధికంగా ఉన్నది. అయితే వాళ్లు వెళ్తున్న రూటు గురించి పూర్తిగా అవగాహన లేకపోవడంతో ఆ టూరిస్టులు గూగుల్ మ్యాప్స్ ఫాలో అయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి ఆదుకున్నారు. పెట్రోలింగ్ టీమ్‌తో పాటు స్థానికులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. హైదరాబాదీలు వెళ్లిన వాహనం నీటిలో పూర్తిగా మునిగిపోయింది. కానీ నలుగురూ సురక్షితంగా ఉన్నారు.

ముందడుగు
ఆదివారం, 26-5-2024, హైదరాబాద్

# జనరల్ బోగీ కంటే దారుణంగా ఏసీ కంపార్ట్ మెంట్

- సమయానికి ఎక్కడ కనబడని రైల్వే పోలీసు
- తనకు జరిగిన అనుభవాన్ని షేర్ చేసిన ప్రయాణీకుడు

**ముందడుగు జాతీయం:**

రైల్వే జనరల్ ప్రయాణం అంటేనే అడుగుదీసి అడుగు వేయలేం. జనరల్ బోగీలో ప్రయాణీకులు ఎక్కువైతే పక్కన ఉన్న రిజర్వేషన్ బోగీలోకి అడుగుపెడతారు. ఏసీ కంపార్ట్ మెంట్ లో మాత్రం కచ్చితంగా రైల్వే నిబంధనలు పాటించాలి. రిజర్వేషన్ కన్ఫర్మ్ కాని వారిని, టికెట్ లేనివారిని ఆర్‌పీఎఫ్ సిబ్బంది బయటకు పంపేస్తారు. కానీ, బ్రహ్మపుత్ర ఎక్స్‌ప్రెస్‌లో ఓ కుటుంబానికి ఎదురైన అనుభవం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఏసీ కంపార్ట్ మెంట్, జనరల్ బోగీ కంటే దారుణంగా నిండిపోయింది. రిజర్వేషన్ కన్ఫర్మ్ కానివారు, అసలు టికెట్ తీసుకోనివారు కూడా అందులోకి వచ్చేయడంతో థర్డ్ ఏసీ బోగీ కాస్తా చేపల మార్కెట్‌లా తయారైంది.



విజయ్‌కుమార్ అనే వ్యక్తి బ్రహ్మపుత్ర ఎక్స్‌ప్రెస్‌కి థర్డ్ ఏసీ కంపార్ట్ మెంట్ లో 8 టికెట్లు బుక్ చేశారు. పట్నా స్టేషన్‌లో రైలు ఎక్కగానే ఆయన కుటుంబానికి విచిత్ర అనుభవం ఎదురైంది. అప్పటికే సీట్లన్నీ నిండిపోయి. జనం కిక్కిరిసి ఉన్నారు. తమకు రిజర్వేషన్ కన్ఫర్మ్ అయ్యిందని చెప్పినా ఎవరూ వినిపించుకునే పరిస్థితిలో లేరు. సాయం కోరేందుకు ఆర్‌పీఎఫ్ సిబ్బంది కూడా అందుబాటులో లేరు. చివరికి ఏదోలా ప్రయత్నించి విజయ్ ఆరు సీట్లు దక్కించుకున్నారు. అక్కడి పరిస్థితిని వీడియో తీసి ఎక్స్‌లో పోస్టు చేయడంతో అది వైరల్‌గా మారింది. ఒక్క బ్రహ్మపుత్రలోనే కాదు చాలా రైళ్లలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. రద్దీగా ఉండే మార్గాల్లో ప్రయాణికుల భద్రత, వారికి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యతపై ఈ వీడియో పలు ప్రశ్నలు అడుగుతోంది. రిజర్వేషన్ బోగీల్లోకి సాధారణ ప్రయాణికులు రాకుండా చూడాల్సిన బాధ్యత రైల్వే అధికారులపై ఉన్నప్పటికీ విస్మరిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# చనిపోయిన వ్యక్తికి చికిత్స చేసిన వైద్యులు

## ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

**ముందడుగు హైదరాబాద్:**


కొన్ని కార్పోరేట్ ఆసుపత్రులు చికిత్స కంటే ముందు డబ్బులు వసూలు చేయడంలోనే ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. ఎవరైనా అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళితే లేని, పోని పరీక్షలు చేసి లక్షలు వసూలు చేస్తారు. అలాంటిది చనిపోయిన వ్యక్తికి డాక్టర్లు చికిత్స చేశారని మృతుడి బంధువులు ఆరోపించారు. సూర్యాపేట జిల్లా సోలిపేటకి చెందిన సమ్మయ్యకు గుండెనొప్పి రావడంతో నిన్న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ ఎల్బీ నగర్ లోని ఓ కార్పొరేట్



హాస్పిటల్ కు తీసుకొచ్చారు. సమ్మయ్యకు ఈసీజీ చేసిన డాక్టర్లు గుండె సమస్య ఉందని చెప్పి జాయిన్ చేసుకున్నారు. అయితే రాత్రి సమ్మయ్య చనిపోయాడని కుటుంబసభ్యులకు ఆసుపత్రి సిబ్బంది చెప్పారు. డాక్టర్ల నిర్లక్ష్యంతో సమ్మయ్య చనిపోయాడంటూ అతని బంధువులు ఆందోళన చేశారు. దీంతో హాస్పిటల్ ముందు ఉద్రిక్తత చోటు చేసుకుంది. నడుచుకుంటూ హాస్పిటల్ కు వచ్చిన వ్యక్తిని చంపేశారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రూ. 60 వేలు కడితేనే డెడ్ బాడీ ఇస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చనిపోయిన వ్యక్తికి ట్రీట్మెంట్ చేశారని ఆరోపించారు.

# గొడుగు పట్టుకొని బస్సు నడిపిన డ్రైవర్

## వీడియో తీసిన కండక్టర్, ఇద్దరిని సస్పెండ్ చేసిన అధికారులు



**ముందడుగు కర్ణాటక:**

బస్సు డ్రైవర్ ఒక చేత్తో గొడుగు పట్టుకుని బస్సును నడుపుతున్నాడు. దీంతో అక్కడ ఉన్న కండక్టర్ వీడియోను రికార్డు చేయడంతో ఆ వీడియో వైరల్ కావడంతో వారిద్దరినీ సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా బస్సు డ్రైవర్, కండక్టర్ వినోదం కోసమే ఈ వీడియో తీశారని చెబుతున్నారు. కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

నార్త్ వెస్ట్రన్ కర్నాటక రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ప్రకారం.. ఈ సంఘటన గురువారం జరిగింది. ఈ సమయంలో బస్సు డ్రైవర్ హనుమంతప్ప కిల్లెదర, కండక్టర్ అనిత డ్యూటీలో ఉన్నారు. డ్రైవర్ బస్సును బెటగేరిధార్వాడ మార్గంలో నడుపుతున్నాడు. సాయంత్రం బస్సులో ప్రయాణికులు ఎవరూ లేరు. అప్పుడు డ్రైవర్ తన వినోదం కోసం గొడుగును పట్టుకున్నాడు. అదే సమయంలో మరో చేత్తో బస్సును నడుపుతున్న సమయంలో బస్సులో ఉన్న కండక్టర్ హెచ్ అనిత ఘటన మొత్తాన్ని వీడియో తీశారు. అతను ఈ వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు, ఆ వీడియో కొద్ది సేపటికే వైరల్‌గా మారింది.

# మోడీ 56 అంగుళాల ఛాతీ ఎక్కడ

మొదటిపేజీ తరువాయి

భాగంగా శనివారం హిమాచల్ ప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొన్న ఖర్గే.. మోదీపై విమర్శలు గుప్పించారు. నాటి భారత ప్రభుత్వం (కాంగ్రెస్ హయాంలో) పాకిస్థాన్‌తో పోరాడి బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టింది. భారత్ భూభాగాలను చైనా ఆక్రమించింది. ఇక్కడ రోడ్లు, ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. అయినా.. ప్రధాని నరేంద్ర మోదీ మౌనంగా ఉన్నారు. ఇప్పుడు మీ 56 అంగుళాల ఛాతీ ఎక్కడ ఉంది?'' అని ఖర్గే ప్రశ్నించారు.

2023లో హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వరదలు వచ్చిన సందర్భాన్నిగురు్తు చేస్తూ.. మోదీ సర్కార్‌పై ఖర్గే విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. ''వరదలతో హిమాచల్ అతలాకుతలమైంది. నాడు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్ల సాయం కోరినా కేంద్రం స్పందించకపోవడం బాధాకరం. రాజ్యాంగం, దేశ ప్రజలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా శ్రమిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే ప్రభుత్వంలో ఉన్న 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తాం'' అని హామీ ఇచ్చారు.

# మహిళ చేతి వేళ్లకు గిన్నిస్ రికార్డు

## 25 ఏళ్లుగా 42 అడుగులు పెంచిన గోళ్లు




**ముందడుగు అమెరికా:**

అమెరికాకు చెందిన డయానా ఆర్మ్‌స్ట్రాంగ్ అనే మహిళ ప్రపంచంలోనే అత్యంత పొడవైన గోళ్లు కలిగిన మహిళగా గిన్నిస్ రికార్డును సొంతం చేసుకున్నారు. ఆమె చేతి వేళ్లకు 1,306.58 సెం.మీ (42 అడుగుల 10.4 అంగుళాల) పొడవైన గోళ్లు ఉన్నట్లు గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు వెల్లడించారు. ఆమె 25 ఏళ్లుగా తన గోళ్లను పెంచుతోందని, అవి మినీ స్కూల్ బస్సు కంటే పొడవుగా ఉన్నాయని వారు తెలిపారు. 1997లో తన పెద్ద కుమార్తె లతీషా ఆస్తమాతో మరణించడంతో డిప్రెషన్ లోకి వెళ్లానని డయానా తెలిపారు. లతీషాకు పొడవైన గోళ్లంటే ఇష్టమని అందుకే అప్పటినుంచి తన కూతురి గుర్తుగా గోళ్లు పెంచుతున్నానని ఆమె పేర్కొన్నారు. అవి అందంగా కనిపించేందుకు వివిధ రంగులతో తరచూ పెయింట్ చేసుకుంటానని తెలిపారు. తాజాగా ప్రపంచ రికార్డు సాధించడంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన పోస్టును గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ తన అధికారిక ఎక్స్ (ట్విటర్) ఖాతాలో పోస్టు చేసింది.

ముందడుగు
ఆదివారం, 26-5-2024, హైదరాబాద్




ఉప్పల్ శిల్పరామంలో కిక్కిరిసిన

# తెలంగాణ ఎడ్యుకేషన్ ఫెయిర్

**వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు**

**ముందడుగు హైదరాబాద్:**

ఉప్పల్ శిల్పరామంలో తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా తెలంగాణ ప్రభుత్వ పబ్లిక్ ప్రసిక్యూటర్ పల్లె నాగేశ్వరావు, పిన్న వయసులో ఎవరెస్టు అధిరోహించిన మాలవత్ పూర్ణ పాల్గొని పిల్లలని ఉదేశించి మాట్లాడారు.. రెండు రోజులు జరిగే ఈ సమ్మేళనంలో మార్వాడీ, గురునానాక్, అరోరా, ఎమ్విఎస్ఆర్, ఎస్ఆర్ఎమ్, మల్లారెడ్డి, స్టాన్లీ, శ్రీధత్త విశ్వ విశ్వని బిబిఎ కాలేజీలతో పాటు తెలంగాణ మరియు ఇతర రాష్టలా ప్రయివేట్ యూనివర్సిటీలు కాలేజీ యాజమాన్యలు పాల్గొన్నాయి. ఈ విద్యా అవగాహన సదస్సులో 5000 లకు పైగా విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ విద్యా సమితి అధ్యక్షులు నిర్వాహకులు తారక్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆదివారం కూడా కొనసాగనున్న ఈ సదస్సులో పెద్ద ఎత్తున పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్ నాయుడు, గణేష్ నాయక్ డిజె రమేష్, అశోక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ, సాఫ్ట్ వేర్ రంగం కుదేలేనా..!

- పెద్ద, పెద్ద కంపెనీలలో ఉద్యోగులకు ఉద్వాసన
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపే కంపెనీల ఆసక్తి

**ముందడుగు ప్రత్యేకం**



చాలా మంది యువత బీటెక్ పూర్తవగానే ఐటీ రంగం వైపు ఆసక్తి పెడుతారు. క్యాంపస్ ప్లేస్మెంట్స్‌లో ఐటీ ఉద్యోగం సాధించాలని కలలుగంటారు. ఒకవేళ క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం రాకపోయినా ఏదో ఒక కోర్స్ నేర్చుకొని అందులో ప్రావీణ్యం పొంది ఉద్యోగం సాధించేవారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారిపోతుంది. మారుతోన్న టెక్నాలజీకి అనుగుణంగా ఉద్యోగాల్లోనూ మార్పులు వస్తున్నాయి. కంపెనీలు ఉద్యోగుల నైపుణ్యాలపై దృష్టిసారిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా లేఆఫ్ భయపెడుతోన్న వేళ, లెవెల్స్. ఎఫ్‌వైఐ అనే ప్లాట్ ఫామ్ కీలక విషయాలను వెల్లడించింది.

## అన్ని సెక్టార్లలో పెరిగిన కృత్రిమ మేధ

ప్రస్తుతం టెక్నాలజీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం అనివార్యంగా మారింది. దాదాపు అన్ని సెక్టార్లలో కృత్రిమ మేధ వినియోగం పెరిగిపోయింది. దీంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కచ్చితంగా తమ స్కిల్‌స్‌ను అప్‌డేట్ చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఏదో ఒక కోర్‌స్‌తో సరిపెట్టుకుంటామనే రోజులు పోయాయి. కచ్చితంగా అప్‌డేట్ కావాల్సిందే. ప్రపంచ దిగ్గజ సంస్థలు.. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా వంటివి సైతం ఎక్కువగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యం ఉన్న ఇంజనీర్లనే తీసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నాయి.

## ఏఐ ఉద్యోగులకే అధిక వేతనాలు

ఓవైపు ఉద్యోగాలు పోతున్నాయన్న భయాల నడుమ ఈ టెక్నాలజీలో ప్రావీణ్యం ఉన్న వారికి అధిక వేతనాలు చెల్లిస్తున్నాయి. సాధారణ సాఫ్‌ట్‌వేర్ ఇంజనీర్లతో పోల్చితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన ఉన్న వారికి 50 శాతం అధిక వేతం చెల్లిస్తున్నాయని 'లెవెల్స్.ఎఫ్‌వైఐ' తన తాజా నివేదికలో పేర్కొంది. గత నెలాఖరు నాటికి అమెరికాలో ఏఐ స్కిల్స్ ఉన్న సాఫ్ట్ వేర్ ఇంజినీర్ల వేతనం ఏటా సరాసరి మన కరెన్సీలో రూ.2,49,31,650గా ఉంది. సాధారణ ఐటీ ఉద్యోగులతో పోల్చితే వీరికి సుమారు లక్ష డాలర్లు అధికంగా చెల్లిస్తున్నారని నివేదికలో పేర్కొన్నారు.

### ఏఐ నిపుణులకే డిమాండ్

రెండేళ్ల క్రితం ఏఐ నిపుణులు, సాధారణ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ల మధ్య వేతనంలో వ్యత్యాసం 30 శాతం ఉంటే, ఇప్పుడది ఏకంగా 50 శాతానికి చేరుకున్నది. దీనిబట్టే రానున్న రోజుల్లో ఏఐ నిపుణులకు ఎలాంటి డిమాండ్ ఉండనుందో స్పష్టమవుతోంది. కాబట్టి రానున్న రోజుల్లో ఉద్యోగాలు కోల్పోకూడదన్నా, మరింత మెరుగైన జీతాలు పొందాలన్నా ఉద్యోగులు కచ్చితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంబంధిత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు చెబుతున్నారు.

# అమిటీ ఇస్రో జాయింట్ వర్క్ షాప్‌ను ప్రారంభించిన ఎస్. సోమనాథ్

**ముందడుగు హైదరాబాద్:**




ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) చైర్మన్, డాక్టర్. S. సోమనాథ్, 25 మంది శాస్త్రవేత్తల బృందంతో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ మరియు ఆస్ట్రోబయాలజీపై జాయింట్ వర్క్‌షాప్ కోసం అమిటీ యూనివర్సిటీ బెంగళూరును సందర్శించారు. హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్, ఇస్రోలో కెపాసిటీ బిల్డింగ్ & పబ్లిక్ ఔట్‌రీచ్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్ కుమార్ ఎన్, బెంగళూరు, నోయిడా, గురుగ్రామ్, ముంబై, రాయ్‌పూర్‌లోని అమిటీ యూనివర్సిటీలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరయ్యారు. సంఘటన. అమిటీ ఎడ్యుకేషన్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు, డాక్టర్ అశోక్ కె. చౌహాన్ అమిటీని ఇస్రో యొక్క నంబర్ 1 R&D మరియు అకడమిక్ పార్టనర్‌గా ఉండాలనే తన విజన్‌ను పంచుకున్నారు. అమిటీ ఛాన్సలర్, డాక్టర్. అసీమ్ చౌహాన్ తన కృతజ్ఞతలు తెలుపుతూ, "ఈరోజు అమిటీ యూనివర్సిటీ బెంగుళూరులో డాక్టర్ సోమనాథ్ మాతో ఉండటం మరియు హైపర్‌సోనిక్ వేగంతో ఈ సహకారాన్ని ఫలవంతం చేసినందుకు మేము చాలా విశేషమైన మరియు సంతోషిస్తున్నాము."

# యుద్ధ ప్రాతిదికన మేడి గడ్డ మరమ్మతులు

**పునరుద్ధరణ చర్యల్లో రోజుకో సమస్య ■ 16వ గేటు ఎత్తే క్రమంలో ఇబ్బందికర పరిస్థితి ■ వచ్చే వారం బ్యారేజి పరిశీలనకు రేవంత్**

**ముందడుగు హైదరాబాద్:**



మేడిగడ్డ బ్యారేజీ తాత్కాలిక పునరుద్ధరణ చర్యల్లో భాగంగా రోజుకో సమస్య ఎదురువుతోంది. ఒక సమస్యను పరిశీలించి, ముందడుగు వేసే క్రమంలో మరో సమస్య తలెత్తుతుంది. బ్యారేజీలో దెబ్బతిన్న, కుంగిన ఏడో బ్లాక్ ప్రాంతంలో విభిన్న సవాళ్లు ఎదురవుతుండగా ఇంజినీరింగ్ అధికారుల పనితనంతో ముందుకు సాగాల్సిన పరిస్థితి వస్తోంది. మూసిఉన్న గేట్లను ఎత్తే ప్రక్రియలో 15వ గేటును ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఎత్తారు. 16వ గేటు ఎత్తే క్రమంలో ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. మిగతా గేట్లను ఎత్తడానికి సమాయాత్తం అవుతూ, ఏడో బ్లాక్ ప్రదేశంలో పునరుద్ధరణ చర్యలను సాగిస్తున్నారు. ఇందులో పలు పనులు సాగుతుండగా సమస్యలు ఎదురువుతున్నాయి., శుక్రవారం పనులు చేస్తుండగా 20వ పియర్ వద్ద భారీ బుంగను ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. ఇందులో మట్టిని పోసి పూడ్చివేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, పూర్తిస్థాయి పరిశీలన, బుంగల సమస్య తీరే వరకు ఈ ప్రాంతాన్ని గుర్తులతో నిషేధిత ప్రదేశంగా ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో పలు చిన్న చిన్న బుంగలు ఏర్పడగా వాటిని సైతం పూడ్చి వేసి పరిశీలన చేస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీ దిగువన ఏడోబ్లాక్ ప్రాంతంలో భారీగా నీటిఊటలు వస్తున్నట్లు తెలుస్తోంది. నీటిఊటలను గుర్తించి, నీటిని నియంత్రిచడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బ్యారేజీ దిగువన సీసీ బ్లాక్ అమరిక పనులు కొనసాగిస్తున్నారు. ఏడో బ్లాక్ ప్రాంతంలోకి నీటి ప్రవాహం రాకుండా నీటి మళ్లింపు పనులను చేస్తున్నారు. శుక్రవారం పనులు చేస్తుండగా 20వ పియర్ వద్ద భారీ బుంగను ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. ఇందులో మట్టిని పోసి పూడ్చివేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, పూర్తిస్థాయి పరిశీలన, బుంగల సమస్య తీరే వరకు ఈ ప్రాంతాన్ని గుర్తులతో నిషేధిత ప్రదేశంగా ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో పలు చిన్న చిన్న బుంగలు ఏర్పడగా వాటిని సైతం పూడ్చి వేసి పరిశీలన చేస్తున్నారు.మేడిగడ్డ బ్యారేజీ దిగువన ఏడోబ్లాక్ ప్రాంతంలో భారీగా నీటిఊటలు వస్తున్నట్లు తెలుస్తోంది. నీటిఊటలను గుర్తించి, నీటిని నియంత్రిచడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బ్యారేజీ దిగువన సీసీ బ్లాక్ అమరిక పనులు కొనసాగిస్తున్నారు. ఏడో బ్లాక్ ప్రాంతంలోకి నీటి ప్రవాహం రాకుండా నీటి మళ్లింపు పనులను చేస్తున్నారు.